సాక్షి శ్రీకాకుళం

ఆదివారం | 17 | నవంబర్ | 2024



‘ఆమె’ రూటే సెపరేటు

విద్యుత్ శాఖలో వివాదాలు రేగుతున్నాయి. అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి.

- 8లో



రీ పోస్టుమార్టం

జిల్లా కేంద్రంలో పాతిపెట్టిన మృతదేహాన్ని మళ్లీ వెలికి తీశారు. ఫిర్యాదుల నేపథ్యంలో రీ పోస్టుమార్టం చేశారు.

- 8లో

అపార్ కోసం రాత్రి పూట అవస్థలు

టెక్కలి: అపార్ నమోదు కోసం విద్యార్థుల తల్లి దండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం రాత్రి జనన ధ్రువీకరణ పత్రాల్లో చేర్పులు, మార్పుల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడిగాపులు కాయడం కనిపించింది. నిన్నటి వరకు ఆధార్‌లో చేర్పులు, మార్పుల కోసం ఇప్పుడు జనన ధ్రువీకరణ పత్రాల్లో చేర్పులు మార్పులు కోసం తిరగాల్సి వస్తోంది.

న్యూస్‌రీల్

లాసెట్ తుది విడత కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ లాసెట్–2024 తుది విడత కౌన్సెలింగ్‌కు సెట్ కన్వీనర్ షెడ్యూల్ విడుదల చేశారు. షెడ్యూల్ మేరకు ఆదివారం సాయంత్రంలోపు రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలి. 19వ తేదీలోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలి. 20 నుంచి 23వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. 24న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చారు. 26న అలాట్‌మెంట్లు ప్రకటిస్తారు. సీట్లు లభించిన విద్యార్థులు 27వ తేదీ నుంచి 30 మధ్య సీట్లు లభించిన కళాశాలలకు రిపోర్టు చేయాలి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 66 సీట్లకు 40 మూడేళ్ల ఎల్ఎల్‌బీలో ప్రవేశాలు జరిగాయి. జిల్లాలో ఎంపీఆర్ ప్రైవేట్ లా కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులు ఉన్నాయి. మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 60 సీట్లుకు 30, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో 60 సీట్లుకు 18 ప్రవేశాలు జరిగాయి.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటగోపాల సత్యనారాయణ



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈయన 2011లో వైఎస్సార్ సీపీలో చేరారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి 1988 నుంచి ఇప్పటివరకు సర్పంచ్‌గా ఉన్నారు. ఎంపీపీగా మూడు సార్లు గెలుపొందారు.

వైఎస్ జగన్ నమ్మకాన్ని నిలబెడతా

సరుబుజ్జిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి రోజు గ్రామస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజావ్యతిరేకత మూటగట్టుకుందని, 2029లో మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయమని అన్నారు. సమావేశంలో ఎంపీపీ కిల్లి రమాదేవి, కిల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో పర్యాటకుల సందడి (ఫైల్)

జాగ్రత్తగా ఉండి తీరాలి

- జిల్లాలోని బీచ్‌లలో మొదలుకానున్న పిక్నిక్ సందడి
- సముద్ర తీరాల్లో అప్రమత్తత అవసరం
- అనవసర సాహసాల జోలికి వెళ్లవద్దని పోలీసుల విజ్ఞప్తి

అల ప్రమాదాల వల వేస్తుంది. ఆహ్లాదంగా కనిపించే తీరం మాటున అపాయం దాగి ఉంటుంది. కాసింత ఏమరపాటుగా ఉన్నా కనురెప్ప పాటులో కదలి తనలో కలిపేసుకుంటుంది. పిక్నిక్‌ల కోసం సముద్ర తీరాలకు వెళ్లేవారికి గత ప్రమాదాలే హెచ్చరికలు. జాగ్రత్తలు తీసుకోకపోతే అపాయం తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

టెక్కలి/వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్:

జిల్లాలో సువిశాలంగా 193 కిలోమీటర్ల విస్తీర్ణంలో గల సముద్ర తీర ప్రాంతంలో 11 మండలాల పరిధిలో అనేక చోట్ల బీచ్‌లు ఉన్నాయి. ఏటా ఏదో ఒక బీచ్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతో మంది యువకులు బలైపోతున్నారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఈ ప్రమాదాలను నివారించవచ్చు.

పర్యాటక బీచ్‌లు ఇవే..

జిల్లాలోని బారువ, శివసాగర్ (అక్కుపల్లి), భావనపాడు, గనగళ్లవానిపేట, దిబ్బలపాడు, కుప్పిలి, డి.మత్స్యలేశం, మొగదాలపాడు, బాహుదా సాగర్, సంగాం, డొంకూరు, ఒంటూరు, కవిటి, పితాళి, లక్ష్మీపురం, మెట్టూరు, రాజారాంపురం, దేవునల్తాడ, వజ్రపుకొత్తూరు, ఇద్దివానిపాలెం తీరాలకు ఏటా అధిక సంఖ్యలో వన భోజనాలకు వెళ్తారు.



అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో విన్యాసాలు

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు..

- పిక్నిక్ ప్లాన్ చేసే ముందే బీచ్‌లో నీటి లోతు, అలల ఉద్ధృతి గురించి తెలుసుకుంటే మంచిది.
- పిల్లలను పెద్దలు, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలి.
- తీరంలో విహరించే సమయంలో పరిమితికి మించి బో టు ఎక్కకూడదు. లైఫ్ జాకెట్ల ను తప్పని సరిగా ధరించాలి.
- ముఖ్యంగా మిగిలిన రోజుల కంటే అమావాస్య రోజుల్లో అలల ఉద్ధృతి అధికంగా ఉంటుంది.
- కోతకు గురైన తీర ప్రాంతానికి వెళ్లకూడదు.
- బీచ్ ప్రాంతంలో మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాలు లేకుండా చూడాలి. పర్యాటకులు సైతం మద్యం సేవించడంపై నిషేధం ఉండాలి.



- ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆదమరిస్తే రాకాసి అలల తాకిడికి నీటిలో కొట్టుకుపోయే అవకాశం ఉంది.



- ప్రధానంగా మద్యం తాగి ఎట్టి పరిస్థితులోనూ సముద్రంలోకి దిగకూడదు. ఉప్పు నీటి కారణంగా మత్తు ఎక్కువై శరీరం స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంది.



- చెరువుల్లో మాదిరిగా సముద్రంలో ఈత కొట్టలేమని గ్రహించాలి.



- అల్పపీడనం ప్రభావం ఉంటే ఆయా రోజుల్లో సముద్ర తీరానికి వెళ్లకపోవడం మంచిది.

● ఏ తీరంలో ప్రమాదం జరిగినా ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే మెరైన్ పోలీసుల సాయం లభిస్తుంది.

1093

- జన సంచారం లేని తీరానికి దూరంగా ఉండాలి.
- లోతైన ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అలాగే గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి.
- బీచ్‌లో సందర్శకుల తాకిడి అధికంగా ఉన్నప్పుడు స్థానిక పోలీసులతో పాటు మెరైన్ పోలీసులు అందుబాటులో ఉండాలి. బీచ్‌లో ఎంత దూరం వరకు శ్రేయస్కరమో అధికారులు, పోలీస్ సిబ్బంది తగిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి సందర్శకులను అప్రమత్తం చేయాలి.

బీచ్‌లలో అప్రమత్తంగా ఉండాలి

బీచ్‌లలో పిక్నిక్‌లు చేసుకునే వారు ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే బీచ్‌ల పరిధి గ్రామాల్లో కమిటీలు వేశాం. సముద్ర తీరంలో మునిగిపోకుండా ఉండేందుకు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం. స్థానికంగా ఉన్న పోలీసులతో సమన్వయంగా సముద్ర తీరంలో ప్రమాదాలను నివారించే చర్యలు చేపడుతున్నాం.

– డి.రాము, మెరైన్ సీఐ, భావనపాడు

కళింగపట్నం బీచ్‌లో సందర్శన లేదు

కళింగపట్నం బీచ్‌లో సందర్శన రద్దు చేశాం. ఈ ప్రాంతంలో అలల ఉద్ధృతి ఎక్కువై సముద్రం ముందుకు రావడంతో ముందస్తు చర్యలుగా సందర్శన రద్దు చేశాం. మిగిలిన మొగదాలపాడు, పెద్దగనగళ్లవానిపేట, కుందువానిపేట తీర ప్రాంతంలో ఇద్దరు ఎస్‌ఐల తో పాటు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నాం. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా ఉండేందుకు గస్తీలు ముమ్మరం చేస్తున్నాం. నిషేధిత బీచ్‌ల వైపు పిక్నిక్‌లకు వెళ్లకపోవడం ఎంతో మంచిది.

– బి.ప్రసాదరావు, మెరైన్ సీఐ కళింగపట్నం.

ఇద్దరిని మింగేసిన బావి

- కనిమెట్టలో బావిలో పడి ఇద్దరు మృతి
- మోటారు ఇంజిన్ కోసం దిగి మునిగిపోయిన వైనం



విలపిస్తున్న మధుసూదనరావు భార్య



ఢిల్లీశ్వరరావు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

పొందూరు:



మధుసూదనరావు (ఫైల్)

ఆ ఇంటి బావి ఇద్దరిని మింగేసింది. మోటారు ఇంజిన్ కోసం దిగిన కుటుంబ పెద్ద మునిగిపోవడంతో.. ఆయన కోసం దిగిన మేనల్లుడు కూడా తిరిగి బయటకు రాలేకపోయారు. ఈ సంఘటన పొందూరు మండంలోని కనిమెట్ట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కనిమెట్ట గ్రామానికి చెందిన రఘుపతి మధుసూదనరావు(50) అదే గ్రామానికి చెందిన కింతలి ఢిల్లీశ్వరరావు(23)లు మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు..

మధుసూదనరావు ఇంటిలోకి శుక్రవారం రాత్రి విషసర్పం రావడంతో దాన్ని చంపేందుకు ప్రయత్నించారు. గాయమైన పాము ఇంటి నందల బావిలో పడిపోయింది. పాము నూతిలో పడిపోవడంతో శనివారం ఉదయం మధుసూదనరావు, అతని మేనల్లుడు కింతలి ఢిల్లీశ్వరరావు పామును తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆయిల్ ఇంజిన్‌తో బావిలో నీటిని తోడుతుండగా ఇంజిన్ బావిలో పడిపోయింది. దీన్ని బావిలో నుంచి తీసేందుకు మధుసూదనరావు దిగాడు. బావిలోకి దిగిన మధుసూదనరావు ఎంతకీ పైకి రాకపోవడంతో అతని మేనల్లుడు కింతలి ఢిల్లీశ్వరరావు కూడా బావిలోకి దిగాడు. కానీ ఇద్దరూ బయటకు రాలేకపోయారు. బావిలో ఎక్కువగా నీరు ఉండటంతో పాటు ఇంజిన్ ఆయిల్ మొత్తం విస్తరించి ఉండడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రయత్నించి మొదటి ఢిల్లీశ్వరరావును బయటకు తీశారు. తర్వాత మధుసూదనరావును బయటకు తీశారు. మధుసూదనరావు తలకు తీవ్రగాయమైనట్లు గుర్తించారు. ఇద్దరూ చనిపోయారు.



ఇద్దరి మృతికి కారణమైన బావి



ఢిల్లీశ్వరరావు(ఫైల్)

కనిమెట్టలో విషాద ఛాయలు..

వ్యవసాయం చేసే మధుసూదనరావు, ఐటీఐ పాసై ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ఢిల్లీశ్వరరావు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మధుసూదనరావుకు భార్య సరస్వతి, కుమారుడు జగదీశ్వరరావు, వివాహమైన కుమార్తె తిరుమల ఉన్నారు. ఢిల్లీశ్వరరావు తల్లిదండ్రులు కింతలి చౌదరి, రాజేశ్వరి కుమారుడు మృతి చెందాడని తెలియడంతో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. శవపంచనామా నిర్వహించి మృత దేహాలను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ పరిశీలించారు.

టీడీపీ దౌర్జన్యకాండ



గూడేం చిన్నారావును పరామర్శిస్తున్న మండల ప్రత్యేక ఆహ్వానితుడు యు.ఉదయ్‌కుమార్

చిత్రంలో ఉన్న బాధితులు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గూడేం చిన్నారావు, ఆయన మేనత్తలు రట్టి లక్ష్మమ్మ, కదిరి నీలమ్మలు. వీరిపై కర్కశంగా దాడికి తెగబడింది అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు గుళ్ల చిన్నారావు, మాణిక్యాలరావు, మద్దు అప్పలస్వామి, మద్దు రాజు, కారి లింగరాజు. శనివారం గ్రామంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో టీడీపీ నాయకులు ఓ ప్లాన్ ప్రకారం గూడేం చిన్నారావుతో గొడవ పెట్టుకున్నారు. మంచినీళ్లపేట జెట్టీ నిర్మాణంలో కూలీల డబ్బుల విషయమై మాట్లాడదామని వారిని పిలిచారు. కానీ అసలు కారణం వేరు. 2023లో మంచినీళ్లపేట పర్యటనకు వచ్చి గౌతు శిరీషను నిలదీసిన వారిలో చిన్నారావు తదితరులు ఉన్నారు. ఆ కక్షతోనే వీరిని గ్రామ కమిటీ సమావేశానికి రప్పించి గొడవ పెట్టుకున్నారు. వాగ్వాదం పెద్దదయ్యే సరికి ఆడవాళ్లని కూడా చూడకుండా దుస్తులు చింపి దాడి చేశారు. గుళ్ల మాణిక్యాలరావు రట్టి లక్ష్మమ్మ చెంపపై కొట్టి దారుణంగా తిట్టారు. శిరీషను ప్రశ్నించినందుకే తమపై దాడులు చేసి తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మీడియా ముందు బాధితులు వాపోయారు. వజ్రపుకొత్తూరు పోలీసుల సైతం టీడీపీకి కొమ్ముకాసి తమను బెదిరిస్తున్నారని రట్టి లక్ష్మమ్మ, కదిరి నీలమ్మ, గూడేం చిన్నారావులు ఆరోపించారు.

ఈ విషయమై వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ కె.నిహార్‌ను వివరణ కోరగా పలాస ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ఇరువర్గాల నుంచి వాంగ్మూలం తీసుకున్నామని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

– వజ్రపుకొత్తూరు

క్లుప్తంగా

డీఐజీ సమీక్ష



ఐదు జిల్లాల అధికారులతో డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: విశాఖ రేంజి పరిధిలోని ఐదు జిల్లాల ఇన్‌స్పెక్టర్లు, లీగల్ అడ్వైజర్లతో డీఐజీ గోపినాథ్ జెట్టి విశాఖ రేంజి కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగుకు ఆర్థికంగా మద్దతు తెలుపుతున్న వ్యాపారస్తులను పట్టుకోవడం, గంజాయి కేసుల్లో వివిధ రూపాల్లో కూడబెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఆ సంఘం అధ్యక్షుడు చాపర సుందరలాల్ తెలియజేశారు. ఈ మేరకు కాశీబుగ్గలో పోస్టర ఆవిష్కరణ శనివారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు చాపర వేణుగోపాలరావు, సీహెచ్ రవి, వెంకటరావు, మున్నా, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభవంతుల ఆటల పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీల వారీగా (స్త్రీ, పురుషులకు వేర్వేరుగా) ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు కలెక్టరేటు దగ్గరలో, డీఆర్‌డీఏ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న డచ్ భవనం మైదానంలో నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఈనెల 20వ తేదీ ఉదయం 10.00 గంటల నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. సదరు ఆటల పోటీల్లో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు అందరూ పాల్గొవాలని కోరారు.

దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపికలు సోమవారం జరగనున్నాయని దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టును విశాఖపట్నం వేదికగా డిసెంబర్ 8 నుంచి జరగనున్న నార్త్ జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీకి పంపిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 77802 42885 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డిసెంబర్ 12 నుంచి సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల మొదటి సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 12వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ జి.పద్మారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఫీజులు చెల్లింపునకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. ఈనెల 25వ తేదీలోపు ఫీజులు చెల్లించాలన్నారు. 27లోపు రూ.500, 28న రూ.1,500 అదనపు వ్యయంతో ఫీజులు చెల్లించే అవకాశం ఉందని చెప్పారు. గడువులోగా ఫీజులు చెల్లించాలని సూచించారు.

ఆలయంలో చోరీ

జలుమూరు: మండలంలో కూర్మనాథపురం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ గుడి హుండీ చోరికి గురైె, సుమారు రూ.20 వేల నగదు, కొన్ని వెండి వస్తువులు పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగతనం శుక్రవారం రాత్రి 12 గంటల తర్వాత జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. శనివారం వేకువజామున ఆలయంలో పూజలకు వెళ్లిన భక్తులు ఆలయం ముందు హుండీ లేకపోవడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. గ్రామస్తులతోపాటు రోడ్డు వెంబడి నిత్యం వెళ్లేవారు కానుకలు, దక్షిణ రూపేణా కొంత నగదు వేస్తుంటారని, ఏడాదికి ఒకసారి మాత్రమే హుండీ తెరుస్తామని గ్రామస్తులు వివరించారు.

బాలియాత్ర విజయవంతం చేయండి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్న బాలియాత్రను కులాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలని బాలియాత్ర నిర్వహక కమిటీ ప్రతినిధి డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక పత్రిక ప్రటన విడుదల చేశారు. నాటి కళింగ రాజ్య పాలనలో నదీతీరాల్లో దీపోత్సవం నిర్వహించి పితృదేవతలకు నివాళులర్పించిన అనంతరం, నౌకాయానం ద్వారా వ్యాపారం చేసి బాలి(ఇండోనేషియాకు) ద్వీపానికి వెళ్లేవారు. కార్తీక పౌర్ణమి అనంతరం బయల్దేరి శివరాత్రికి తిరుగు ప్రయాణం అయ్యేవారు. వారు క్షేమంగా ఇంటికి చేరేందుకు నిర్వహించే యాత్రనే బాలియాత్ర అని, నాడు వందల సంవత్సరాలు క్రితం నిర్వహించి క్రమేపి కనుమరుగయ్యిందని ఆయన తెలిపారు. మళ్లీ ఈ ఏడాది విజయవంతంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. అన్ని వర్గాలు ప్రజలు యాత్రకు సహకరించాలని కోరారు.

ఆమె రూటే సెపరేటు..!



ఈనెల 5న ఆమదాలవలస బిల్లింగ్ కౌంటర్ మూసివేసిన చిత్రం (ఫైల్)

- విద్యుత్ శాఖలో వివాదాస్పదంగా వ్యవహారం
- యూనియన్ నేత అండతో వివాదాలకు కేంద్రంగా మారిన వైనం
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

అరసవల్లి: విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఆమదాలవలస సబ్ ఈఆర్వోలో పనిచేస్తున్న ఆమె అంటే ఏకంగా సర్కిల్ అధికారులే వణికిపోతున్నారు. ఆమె ఏం చేసినా, చెప్పినా తలూపేస్తున్నారు. ఆఖరికి తాను కార్యాలయ విధులు చేయనని, సహాయకులుగా మరో ఇద్దరిని ఆమదాలవలసకు డిప్యూట్ చేయమంటే జీ హుజూర్ అంటూ అధికారులు ఓ ఇద్దరిని డిప్యూట్ చేసేశారు. ఆమదాలవలసలో ప్రస్తుతం ఉన్న స్టాఫ్ సరిపోతారని, ఇక్కడ అదనంగా సిబ్బందిని వేయొద్దని కొద్దినెలల క్రితం రెవెన్యూ విభాగం ఏఏవో ప్రభాకరరావు ఏకంగా లిఖితపూర్వకంగా నివేదించినా అవేవీ 'ఆమె' పవర్ దగ్గర పనిచేయలేదు. గతంలో ఎన్నో వివాదాలకు కారణంగా ఉన్న ఈమె తాజాగా మరో వివాదానికి కారణమయ్యారు. విద్యుత్ వినియోగదారుల బిల్లుల చెల్లింపునకు పండగ, సెలవు రోజులైనా తెరవాల్సిందే అంటూ ఓవైపు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ యాజమాన్యం ప్రకటిస్తుంటే, ఇవేవీ పట్టకుండా ఈనెల 5న ఏకంగా ఆమదాలవలస సబ్ ఈఆర్వో (ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీస్) బిల్లింగ్ కౌంటర్‌కు తాళాలు వేసేసి విధులకు డుమ్మా కొట్టారు. దీంతో ఈ వివాదాస్పద నిర్ణయం స్థానిక సర్కిల్ పరిధిలో హాట్ టాపిక్ అయ్యింది. అయితే ఈ వ్యవహారంపై సర్కిల్ అధికారులు విచారణకు ఆదేశించినప్పటికీ అదంతా ఉత్తుత్తి విచారణ అనేలా విమర్శలు వినిపిస్తున్నాయి. నన్నెవరు అడ్డుకునేది అంటూ ఆమె చేస్తున్న బాహాటపు ప్రకటనలే ఇందుకు బలం చేకూర్చుతున్నాయి.

పని తక్కువ.. సిబ్బంది ఎక్కువ

శ్రీకాకుళం ఈఆర్వో పరిధిలో ఉండే ఆమదాలవలస సబ్ ఈఆర్వోలో పని ఒత్తిడి చాలా తక్కువగానే ఉంటుంది. అంకెల్లో చెప్పాలంటే శ్రీకాకుళం ఈఆర్వో పరిధిలో 11 సెక్షన్లు (మండలాలు) పరిధిలో మొత్తం 2.63 లక్షల మంది వినియోగదారుల నుంచి, సుమారుగా నెలకు రూ.20 కోట్లకు పైగానే బిల్లులు వసూలు చేయించాల్సి ఉంటుంది. కానీ ఆమదాలవలస సబ్ ఈఆర్వోలో కేవలం నాలుగు సెక్షన్లు పరిధిలో 52 వేల మంది వినియోగదారుల నుంచి రూ.2.80 కోట్ల వరకు బిల్లులు (అక్టోబర్ 2024 ప్రకారం) వసూలు చేస్తున్నారు. అయితే శ్రీకాకుళం ఈఆర్వో కంటే ప్రస్తుతానికి ఆమదాలవలసలోనే సిబ్బంది ఎక్కువగా పనిచేస్తున్నట్టుగా ఈఆర్వో అధికారులు సైతం గుర్తించారు. అయినప్పటికీ మరో ఇద్దరిని ఆమదాలవలసలో డిప్యూట్ చేశారు. దీంతో ఆమదాలవలసలో స్టాఫ్ సర్‌ప్లస్‌గా ఉన్నారని భావించిన ప్రస్తుత ఏఏవో కృష్ణారావు సిబ్బందిని అవసరమైన చోట సర్దుబాటు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇది అమలైతే 'ఆమె'కు ఇబ్బంది అని గ్రహించిన సదరు యూనియన్ అగ్రనేత నేరుగా రంగంలోకి దిగడంతో ఏఏవో కృష్ణారావు ఇచ్చిన సర్దుబాటు ఆదేశాలు ఎబియన్స్‌లో పెట్టేసేలా ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

వివాదాలకు కేరాఫ్ అడ్రస్

కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగంలో చేరిన ఆమె మొదటి నుంచి వివాదాలకు అడ్రస్‌గా మారిపోయారు. వివాదాలకు ముందుండే ఆమె గతంలో ఏకంగా తనపై దుర్భాషలాడి వేధించారంటూ ఏకంగా వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్, బీసీ ఎంప్లాయీస్ యూనియన్ నేతలపై నిరాధార నిందలు వేసి వారిపై శాఖాపరంగా చర్యలు చేపట్టేంతలా ప్రభావం చూపించారు. అయితే ఆ నిందలన్నీ అసత్యాలే అని నిర్ధారణ అయినప్పటికీ ఇంతవరకు ఆమెపై ఎలాంటి శాఖాపరంగా చర్యలు తీసుకోలేదు. అలాగే ఆమదాలవలసలోనే తోటి మహిళా ఉద్యోగిపై ఈమె ఏకంగా భౌతిక దాడికి పాల్పడిన ఘటనలో అక్కడి పోలీసులకు ఫిర్యాదులు కూడా చేరాయి. కానీ వీటిపై కూడా తూతూమంత్రంగా షోకాజ్ నోటీసులిచ్చినప్పటికీ తదుపరి చర్యలకు సైతం ఉన్నతాధికారులు వెనుకంజ వేస్తున్నారు. దీనికంతటికీ స్థానిక విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ అగ్రనేత అండదండలు ఉండడమే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి.

నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తాం



ఆమదాలవలసలో వరుస వివాదాలతో పాటు కౌంటర్‌కు తాళాలు పడిన వ్యవహారంపై విచారణకు ఆదేశించాం. ఎస్ఏవో, ఈఈ, ఏవోలతో కూడిన బృందం ఆమదాలవలసలో విచారణ చేపట్టారు. ఈ నివేదికను కార్పొరేట్ కార్యాలయ ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, విద్యుత్ శాఖ

అంగన్‌వాడీల నిరసన గళం



మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీఓ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీఓ ఇవ్వాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరుతూ శనివారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద మినీ అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్అండ్‌బీ బంగ్లా రోడ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు వినతిపత్రం అందించారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో పేద గర్భిణి, బాలింతలు, చిన్న పిల్లలకు సేవలు చేస్తున్న మినీ వర్కర్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రీ స్కూల్ నడపడం, పిల్లలకు వంట చేయటం, పెరుగుతున్న యాప్‌ల భారంతోపాటు ఆన్‌లైన్ ఆఫ్ లైన్ రికార్డుల పని కూడా మినీ వర్కర్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పనిచేస్తున్నా కనీసం వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ధర్నాలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు పి.లతాదేవి, కె.సుజాత, కె.లక్ష్మి, పి.భూలక్ష్మి, కె.మాధవి, కె.హేమలత, జె.కాంచన, నూకమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో ప్రజలను మోసం చేశారు

- ఇప్పుడు మీపై ఎన్ని కేసులు పెట్టాలి
- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్ ధ్వజం



టెక్కలి: సూపర్ సిక్స్ హామీల పేరుతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ఈరోజు ప్రజలను దారుణంగా మోసం చేశారని, అటువంటి చంద్రబాబుపై ఎన్ని కేసులు పెట్టాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. ఈ మేరకు టెక్కలిలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా నిలదీస్తుంటే, అటువంటి వారి గొంతునొక్కే విధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అడ్డగోలుగా కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు.

అయితే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులపై అనుచితంగా, ఇష్టం వచ్చినట్లుగా సోషల్ మీడియాల్లో పోస్టులు పెడుతున్న ఐటీడీపీ కార్యకర్తలపై ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల అమలు చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తోందని దుయ్యబట్టారు. కూటమి నాయకులు ఐదేళ్ల పాలనలో మరోసారి గ్రాఫిక్స్‌తో కాలం గడిపేయాలని చూస్తున్నారన్నారు. ప్రజల తరఫున పోరాటం చేస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలపై చేస్తున్న అరాచకాలను తక్షణమే ఆపాలని, లేని పక్షంలో మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బుడితి సీహెచ్‌సీలో గుండె చికిత్స



రోగితో వైద్య సిబ్బంది

సారవకోట: మండలంలోని బుడితి సీహెచ్‌సీలో మొదటిసారి గుండె సంబంధిత చికిత్సను వైద్యులు ఎం.యుగంధర్, సిబ్బంది శనివారం అందించారు. జలుమూరు మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన పుట్ట కురమయ్య గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రికి వచ్చాడు. ఈయనను పరీక్షించిన వైద్యుడు యుగంధర్ వెంటనే ఆస్పత్రిలో ఈసీజీ పరీక్ష చేయించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో స్టెమీ ప్రోగ్రాంలో భాగంగా గుండె సంబంధిత వ్యాధుల కోసం ప్రత్యేకంగా పరికరాలు, ఇంజెక్షన్లు అందజేశారు. దీంతో ఆయన పరీక్షలు నిర్వహించి సుమారు రూ.40 వేలు విలువ గల ఇంజెక్షన్‌ను వేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గుండెకు వెళ్లే నరాల గోడలు మూసుకుపోవడం జరిగిందని దీనిని త్రాంబోలసిస్ చేయడం అంటారని తెలిపారు. ఇటువంటి ఘటనలు ఇప్పటివరకు ఇక్కడ ఎదురు కాలేదని, శనివారం వచ్చిన కేసు ప్రప్రథమంగా తాము విజయవంతం చేశామన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పుష్ప, రమ్య, రాజేశ్వరి, సోమేశ్వరి ఉన్నారు.

వసప కేజీబీవీ నిర్వహణపై డీఈఓ అసంతృప్తి



వసప కేజీబీవీలో విద్యార్థులకు ఇస్తున్న బోర్నవిటా రుచి చూస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

కొత్తూరు: కొత్తూరు మండలం వసప గ్రామం వద్ద ఉన్న కేజీబీవీ నిర్వహణపై డీఈఓ తిరుమల చైతన్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కేజీబీవీ, నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలను శనివారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ పిల్లలకు పెడుతున్న బోర్నవిటా, తాళింపు శనగల రుచి చూసి ఎస్‌పీఓ రాధికను సున్నితంగా మందలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని సూచించారు. కిచెన్ గార్డెన్ నిర్వహణ కూడా సరిగా లేదన్నారు. నివగాం, కేజీబీవీల అపార్ కార్డులు రిజిస్ట్రేషన్లు ముమ్మరంగ చేయాలని చెప్పారు.

బ్యాంకులు భద్రతా ప్రమాణాలు పాటించాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: బ్యాంకులు, నగదు లావాదేవీలు జరిగే (ఏటీఎం) కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బ్యాంకు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్యాంకు అధికారులు, కోఆర్డినేటర్లతో ఆర్థిక, సైబర్ నేరాలు తదితర అంశాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏటీఎం గార్డులు, క్యాష్‌ఏజెన్సీల వ్యక్తిగత వివరాలు ముందస్తుగా సేకరించి వారి ఆథరైజేషన్, లైసెన్సు, గన్ లైసెన్సు పరిశీలించాలన్నారు. సైబర్ నేరాలు జరిగేటప్పుడు గోల్డెన్ హవర్‌లో బ్యాంకు అధికారులు స్పందించాలని, సంబంధిత అకౌంట్లను ఫ్రీజ్ చేయాలన్నారు. బ్యాంకు ఖాతాదారులెవరైనా ఆన్‌లైన్ మోసాల భారిపడి బ్యాంకులకు వస్తే 1930 లేదా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వివేకానంద, అప్పారావు, రాజశేఖర్, ప్రసాదరావు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం



వ్యక్తిని పాతిపెట్టిన స్థలాన్ని తహసీల్దార్‌కు చూపిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని గూడేం గ్రామానికి చెందిన బొంతల కరువాడు(79) సెప్టెంబర్ 18న గ్రామ సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. ఈయన భార్య కొన్నేళ్ల క్రితమే మృత్యువాత పడింది. పిల్లలు సైతం ఎవ్వరూ లేరు. దీంతో భార్య తరుపు బంధువులే చనిపోయిన తర్వాత దహన సంస్కారాలు నిర్వహించారు. ఇది జరిగి 15 రోజులు గడిచింది. అయితే చనిపోయిన విధానం పలు అనుమానాలకు తావిస్తోందంటూ ఈయన తమ్ముడు బొంతల వాకయ్య కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని బొడ్డేపల్లి అంకమ్మ, బొడ్డేపల్లి వెంకినాయుడులుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు, ఎస్పీ గ్రీవెన్స్‌కు తన కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో విషయం తారాస్థాయికు వెళ్లడంతో శ్రీకాకుళం మండల తహసీల్దార్ గణపతిరావు ఆధ్వర్యంలో రిమ్స్ వైద్యులు, రూరల్ పోలీసులు కలిసి శనివారం గూడేంలోని శ్మశాన వాటికలో రీ పోస్టుమార్టం నిర్వహించారు. అయితే కరువాడ చనిపోయిన తర్వాత అతనికి సంబంధించిన ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

వ్యాన్‌ను ఢీకొట్టిన బైక్



ప్రమాదస్థలంలో దృశ్యం

రణస్థలం: మండలంలోని పైడి భీమవరం ఫ్లైఓవర్‌పై ముందు వెళ్తున్న డీసీఎం వ్యాన్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. వివరాల్లోకి వెళ్తే.. జి.సిగడాం మండలంలోని అద్వానంపేట నుంచి విశాఖపట్నానికి ఒకే ద్విచక్ర వాహనంపై భార్యభర్తలు, వారి ఇద్దరు కుమార్తెలు వెళ్తున్నారు. శనివారం ఉదయం 11.20 గంటల సమయంలో పైడి భీమవరం వంతెనపై డీసీఎం వ్యాన్ సడన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపు చేయలేక వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పిల్ల పాపయ్య(రమేష్) తలకు తీవ్ర గాయంతో పాటు ఒంటిపై బాగా గాయాలయ్యాయి. అతని భార్య రాజేశ్వరికి ఒక కాళ్లు విరిగింది. కుమార్తె పిల్ల లాస్యకు రెండు కాళ్లు విరగడంతో పాటు తీవ్ర గాయాలైయ్యాయి. మరో కుమార్తె సమీరాకు ఎటువంటి గాయాలు కాలేదు. వీరిని 108 వాహనంపై శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రమేష్ విశాఖపట్నంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో అధ్వానంపేటలో ఎలక్ట్రికల్ పనుల చేసుకుని ఉదయం 10.30 గంటల సమయంలో బయల్దేరి విశాఖపట్నం వెళ్తున్నారు. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు ఎంఎల్‌టీ కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయిని ఆత్మహత్య



నవ్య మృతదేహం

కాశీబుగ్గ: పలాస మండలం ఈదురాపల్లి గ్రామానికి చెందిన శాశనపురి నవ్య (32) శనివారం ఉదయం ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆమె ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం స్వగ్రామం ఈదురాపల్లిలోని తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు వేలాడుతూ కనిపించిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని దించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. నవ్య భర్త ఎన్ని షణ్ముఖరావు ఇండియన్ ఆర్మీలో ఉన్నతమైన ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరూ గ్రామానికే కాదు పరిసర ప్రాంతాలకే ఆదర్శంగా నిలిచారు. అటువంటి వారి కుటుంబంలో ఎమైందో ఏమో కాని ఆమె శవమైపోవడంతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. వీరికి రెండేళ్ల పాప ఉంది. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు



మొదలవలస చిన్నారావు (ఫైల్)

గార్డ్ ఆఫ్ హానర్ సమర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఈనెల 13వ తేదీన రాజస్థాన్ రాష్ట్రంలోని బికనీరు వైర్లెస్ యూనిట్‌లో పనిచేస్తున్న ఫరీదుపేట గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మొదలవలస చిన్నారావు (33) ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆర్మీ అధికారులు గ్రామంలోని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందజేసి, మృతదేహం తరలింపునకు ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని విశాఖపట్నం వరకు విమానంలో తీసుకొచ్చి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. దీంతో కింతలిమిల్లు నుంచి జిల్లా మాజీ సైనిక ఉద్యోగులు, గ్రామ యువత బైక్ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. మృతదేహంపై ఉంచిన జాతీయ జెండాను భార్య సులోచనకు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు గార్డ్ ఆఫ్ హానర్ సమర్పించి, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికోద్యోగుల అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.రామకృష్ణ, ఎం.సింహాచలం, పైడి రామారావులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలతో భవనం సీజ్



కెనరా బ్యాంక్ భవనాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భవనానికి సంబంధించి పన్ను బకాయిలు రూ.7 లక్షలు చెల్లించలేదని కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని రామకృష్ణా థియేటర్ సందులో మగటపల్లి శంకరరావుకి చెందిన భవనాన్ని శనివారం కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఉమామహేశ్వరరావు, నరేష్‌లు సీజ్ చేశారు. ఈ భవనంలో ప్రస్తుతం కెనరా బ్యాంక్, సహారా కార్యాలయం, కమర్షియల్ టాక్స్ కార్యాలయం ఉన్నాయి. ముందుగా హెచ్చరికలో భాగంగా మూడో అంతస్తులో బ్యాంక్‌ను మూసినట్లు తెలిపారు. అప్పటికీ కట్టకుంటే అన్ని కార్యాలయాలు మూసేయడం తప్పదని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులతో పాటు అడ్మిన్ సెక్రటరీలు సంజయ్‌కుమార్, నాయుడులు ఉన్నారు.